జాతీయ కబడ్డీ పోటీలకు సర్వం సిద్ధం

- ప్రారంభించనున్న డిప్యూటీ సీఎం, కేంద్రమంత్రి
- నేటి నుంచి 4వ తేదీ వరకు పోటీలు
- క్రీడాకారులకు అసౌకర్యం కలగకుండా వసతి



ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి కాసాని వీరేశ్



బాచుపల్లిలో సిద్ధమైన జాతీయ జూనియర్ కబడ్డీ పోటీల ప్రాంగణం

నిజాంపేట్: జాతీయ స్థాయి జూనియర్ కబడ్డీ పోటీలకు బాచుపల్లి ముస్తాబైంది. కాసాని కౌసల్య, కాసాని కృష్ణ ముదిరాజ్‌ల స్మారకార్థం మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లా కబడ్డీ అసోసియేషన్, తెలంగాణ కబడ్డీ అసోసియేషన్ల ఆధ్వర్యంలో ఐదు రోజుల పాటు జరిగే పోటీలు గురువారం ప్రారంభం కానున్నాయి. దేశ వ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి 30 బాలికలు, 30 బాలుర జట్లు ఈ పోటీల్లో సత్తా చాటేందుకు ఇప్పటికే బాచుపల్లికి చేరుకున్నాయి.

◆ ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరు కానున్నారు. బుధవారం అమెచ్యూర్ కబడ్డీ ఫెడరేషన్ అధ్యక్షుడు, మేడ్చల్ జిల్లా కబడ్డీ అసోసియేషన్ సెక్రటరీ కాసాని వీరేశ్ పోటీలు జరిగే ప్రాంతాన్ని సందర్శించి ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈనెల 1 నుంచి 4వ తేది వరకు జరిగే పోటీలకు సర్వం సిద్ధం చేశామని తెలిపారు. క్రీడాకారులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా అసోసియేషన్ తరఫున వసతి, ఇతర ఏర్పాట్లు చేశామని వీరేశ్ పేర్కొన్నారు.

◆ పోటీలను చూడటానికి వచ్చే వారికి కోసం సీట్లు, తాగునీరు ఏర్పాట్లు చేశామన్నారు. చీకటైనా ఫ్లడ్‌లైట్ల వెలుగులో పోటీలు జరిగేలా అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

ప్రగతినగర్‌లో ఓషన్ రీజనల్ డికేడ్ కాన్ఫరెన్స్ షురూ

నిజాంపేట్: ప్రగతినగర్‌లోని ఇన్‌కాయిస్‌లో నాలుగు రోజుల పాటు జరిగే ఇండియన్ ఓషన్ రీజనల్ డికేడ్ కాన్ఫరెన్స్–2024 గురువారం ప్రారంభం కానుంది. ఇండియన్ నేషనల్ సర్వీస్ సెంటర్ ఫర్ ఓషన్ (ఇన్‌కాయిస్) ఆధ్వర్యంలో జరిగే ఈ సదస్సులో భాగంగా హిందూ మహాసముద్ర ప్రాంతంలోని వాటాదారులను మహాసముద్ర దశాబ్ద కార్యకలాపాలలో పాల్గొనడం, వారిని నిమగ్నం చేయడం, సముద్ర పరిరక్షణకు ఎదురవుతున్న సవాళ్లకు సంబంధించిన భవిష్యత్తు ప్రాధాన్యతలపై చర్చించడం వంటి లక్ష్యాలతో ఈ సమావేశంలో పలు తీర్మానాలు చేయనున్నారు. ఏప్రిల్ 2024లో బార్సిలోనాలో జరిగే 2024 ఓషన్ డికేడ్ కాన్ఫరెన్స్ నేపథ్యంలో ఈ సదస్సు ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ సదస్సులో విద్యావేత్తలు, పరిశ్రమలు, సామాజిక శాస్త్రవేత్తలు, ఎన్ఆర్ఐలు సముద్ర తీర ప్రాంత దేశాల ప్రతినిధులు హాజరు కానున్నారు.

అకస్మాత్తుగా నేలకొరిగిన భారీ వృక్షాలు

తప్పిన ప్రాణాపాయం ● పాక్షికంగా ధ్వంసమైన కార్లు ● భారీగా ట్రాఫిక్ జామ్







కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధి చింతల్ ప్రధాన రోడ్డులోని ముత్తూట్ ఫైనాన్స్ వద్ద బుధవారం రాత్రి భారీ వృక్షాలు అకస్మాత్తుగా నేలకొరిగాయి. అటు వైపుగా వెళ్తున్న వాహనాలపై పడటంతో కారు అద్దాలు ధ్వంసమయ్యాయి. కొన్ని కార్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు. దీంతో కుత్బుల్లాపూర్ నుంచి బాలానగర్‌కు వెళ్లే వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. సమాచారం అందుకున్న పోలీసులు చెట్లను తొలగించి వాహనాలు రాకపోకలు సాగేలా చర్యలు తీసుకున్నారు.

నిబంధనలు పాటించాలి..
ప్రమాదాలు నివారించాలి

- బాలానగర్ ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు
- రోడ్డు భద్రతా వారోత్సవాల నేపథ్యంలో అవగాహన ర్యాలీలు
- ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కలిగి ఉండాలని సూచన



ఐడీపీఎల్ చౌరస్తాలో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తున్న ఏసీపీ శ్రీనివాసులు

రంగారెడ్డినగర్: బాధ్యతాయుత పౌరుడిగా ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కలిగి ఉండాలని బాలానగర్ ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు అన్నారు. అప్పుడే రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చని అన్నారు. బుధవారం బాలానగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సురేష్ ఆధ్వర్యంలో విద్యార్థులతో రోడ్డు భద్రతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఐడీపీఎల్, చింతల్ పరిసరాలకు చెందిన గీతాంజలి డిగ్రీ కళాశాల, బాగ్యరథి డిగ్రీ కళాశాల, విశ్వవిశ్వాని పీజీ కళాశాలకు చెందిన 200 మంది విద్యార్థులు ట్రాఫిక్‌పై అవగాహన కల్పించే ప్లకార్డులను ప్రదర్శించారు.

◆ నర్సాపూర్ రాష్ట్ర రహదారిలోని ఐడీపీఎల్ చౌరస్తా నుంచి బాలానగర్ రోడ్డులోని డిమార్ట్ వరకు, అక్కడ నుండి తిరిగి మెట్‌కానిగూడ వరకు ర్యాలీని కొనసాగించారు. అనంతరం ఐడీపీఎల్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఏసీపీ శ్రీనివాసులు విద్యార్థులకు పలు విలువైన సూచనలు చేశారు.

◆ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ద్విచక్ర వాహనదారులు డ్రైవింగ్ చేసే సమయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. ముఖ్యంగా చౌరస్తాల సమీపంలో అజాగ్రత్త వహిస్తే ఇతరుల ప్రాణాలకు ముప్పు వాటిల్లే అస్కారం ఉందన్నారు. మొబైల్ మాట్లాడుతూ.. రాంగ్ రూట్‌లలో డ్రైవింగ్ చేయొద్దన్నారు. పాదచారులు సైతం జీబ్రా క్రాసింగ్‌ల వద్ద, ఫుట్‌ఓవర్ బ్రిడ్జిల మీదుగా రోడ్లను దాటాలని సూచించారు.

◆ ట్రాఫిక్ నిబంధనలపై ప్రతి ఒక్కరూ పూర్తిగా అవగాహన కలిగి ఉండాలన్నారు. బాధ్యతాయుతంగా ఉంటూ తోటి వారికి ఆదర్శంగా నిలవాలని ట్రాఫిక్ ఏసీపీ సూచించారు. ఈ కార్యక్రమంలో బాలానగర్ ట్రాఫిక్ సిబ్బంది రాజేశ్వర్, జీడిమెట్ల ట్రాఫిక్ సిబ్బంది సందీప్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



ఐడీపీల్ చౌరస్తా నుంచి డీ–మార్ట్ వరకు ర్యాలీలో పాల్గొన్న వివిధ కళాశాలల విద్యార్థులు, ట్రాఫిక్ పోలీసులు



ర్యాలీలో బాలానగర్ ట్రాఫిక్ ఏసీపీ, ఇన్‌స్పెక్టర్ సురేష్

దశలవారీగా అభివృద్ధి పనులు చేపడుతున్నాం



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న కమిషనర్ సత్యనారాయణ, కౌన్సిలర్లు

దుండిగల్: మున్సిపాలిటీ పరిధిలో దశలవారీగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని దుండిగల్ మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ అన్నారు. మల్లంపేటలోని 23వ వార్డులో రూ.42 లక్షలతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, రూ.25 లక్షలతో నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను కౌన్సిలర్లతో కలిసి ప్రారంభించారు. అనంతరం సత్యనారాయణ మాట్లాడుతూ.. అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పనులను వేగంగా పూర్తి చేయాలన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ పద్మారావు, కౌన్సిలర్లు శంభీపూర్ కృష్ణ, మాదాసు వెంకటేశం, శామీర్‌పేట హనుమంత్‌రావు, రంగరాయ ప్రసాద్, రంగయ్య, రాఘవేందర్‌గౌడ్ పాల్గొన్నారు.

◆ అదే విధంగా దుండిగల్‌లోని రెండో వార్డులో రూ.12 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మిస్తున్న సీసీరోడ్డు పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు జక్కుల కృష్ణాయాదవ్, గోపాల్‌రెడ్డి, ఆనంద్‌కుమార్, పీఏసీఎస్ వైస్‌చైర్మన్ నల్తూరి కృష్ణ, మాజీ సర్పంచ్ కావలి గణేశ్, ఎల్లయ్య, శ్రీనివాస్, మల్లేశ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీలకు శుభాకాంక్షలు



ఎమ్మెల్సీలు మహేష్‌కుమార్ గౌడ్, బల్మూరి వెంకట్‌ను కలిసిన కాంగ్రెస్ నేతలు

కుత్బుల్లాపూర్: శాసనమండలి సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేసిన కాంగ్రెస్ నేతలు మహేష్‌కుమార్ గౌడ్, బల్మూరి వెంకట్‌లను ఆ పార్టీ నేతలు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బండి శ్రీనివాస్‌గౌడ్, 132 డివిజన్ అధ్యక్షుడు ముప్పిడి పూర్ణచందర్, దుర్గాప్రసాద్ శాసనసభలో ఎమ్మెల్సీలను కలిసి శాలువాలతో సత్కరించారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

నిజాంపేట్: చెట్ల కొమ్మల తొలగింపు నేపథ్యంలో గురువారం బహదూర్‌పల్లి సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరాలో అవాంతరాలు తలెత్తనున్నాయని భౌరంపేట్ ఏఈ సాయికిరణ్ ఓ ప్రకటనలో తెలియజేశారు. 11కేవీ లక్ష్మీనగర్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4గంటల వరకు లక్ష్మీనగర్‌కాలనీ, విశ్వకర్మ కాలనీ, సూరారం గ్రామం, అయ్యప్ప సొసైటీల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ పేర్కొన్నారు.

బాచుపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో..

శ్రీహోమ్స్‌కాలనీ ఫీడర్ పరిధిలోని క్రాంతినగర్ రోడ్ నం.1 నుంచి 9 వరకు, శ్రీహోమ్స్ కాలనీల్లో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు..

◆ ఎస్ఎంఎస్ ఫీడర్ పరిధిలోని మమత ఆస్పత్రి ప్రాంతం, బొల్లారం ఇండస్ట్రియల్ ఏరియాల్లో మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 4.30గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ శాంతకుమార్ తెలిపారు.

ప్రగతినగర్ ఎలీప్ సబ్‌స్టేషన్‌లో..

ఆర్‌జీకే ఫీడర్ పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు.. జగన్ స్టూడియో ఫీడర్ పరిధిలోని వాసవీ లేఅవుట్, న్యూవిజేత సూపర్‌మార్కెట్ ప్రాంతం, ప్రభుత్వ పాఠశాల, జగన్ స్టూడియో, విష్ణుప్రియనగర్, ఎన్ఆర్ఐ కాలనీల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ప్రగతినగర్ ఏఈ తెలిపారు.

దూలపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో..

కుత్బుల్లాపూర్: దూలపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో ఫీడర్ల నిర్వహణ నేపథ్యంలో గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనుందని కొంపల్లి ఏఈ ఓ ప్రకటనలో తెలిపారు. ఐడీఏ–2, దూలపల్లి ఫీడర్ల పరిధిలో దూలపల్లి ఇండస్ట్రియల్ ప్రాంతం, దూలపల్లి గ్రామం, అశోక్–ఏలా–మైసస్ విల్లాస్ ఫేజ్–1, సెయింట్ మార్టిన్స్ రోడ్డులోని ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు...

◆ స్టీల్ సిటీ, కేకే సొసైటీ ఫీడర్ల పరిధిలోని దూలపల్లి ఇండస్ట్రియల్ ఏరియా, హనుమాన్ వేబ్రిడ్జి, చౌదరి వేబ్రిడ్జి ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

సుభాష్‌నగర్: విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు నేపథ్యంలో గురువారం విద్యుత్ సరఫరాలో ఆటంకాలు ఏర్పడనున్నాయని గాజులరామారం సబ్‌స్టేషన్ ఏఈ చైతన్యభార్గవ్ ఓ ప్రకటనలో తెలియజేశారు.

గాజులరామారం ఫీడర్ పరిధిలో..

గాజులరామారం ఫీడర్ పరిధిలోని ఉషోదయ కాలనీ, చిత్తారమ్మ ఆలయం సమీపంలో, వెంకటేశ్వర గార్డెన్స్ లేన్, బాలాజీ లేఅవుట్, రాయల్ ఫామ్స్, గాజులరామారం గ్రామంలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు..

మహదేవపురం ఫీడర్ పరిధిలో..

మహదేవపురం ఫీడర్ పరిధిలోని యండమూరి లేఅవుట్, ద్వారకానగర్, మల్లారెడ్డినగర్, మహదేవపురం, బాలయ్య బస్తీ, వడ్డెర బస్తీ, సంస్కృతి ఎవెన్యూ తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

ప్లే ఫర్ మల్కాజిగిరి టోర్నమెంట్ ప్రారంభం

దుండిగల్: బీజేపీ క్రీడలకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని ఆ పార్టీ నేత, పల్లవి ఫౌండేషన్ చైర్మన్ మల్క కొమురయ్య అన్నారు. గండిమైసమ్మలోని స్టేడియంలో ప్లే ఫర్ మల్కాజిగిరి క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా కొమురయ్య మాట్లాడుతూ.. ప్రధానమంత్రి నరేంద్రమోదీ తీసుకొచ్చిన 'ఖేలో ఇండియా'ను స్ఫూర్తిగా తీసుకుని ప్లే ఫర్ మల్కాజిగిరి టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. పోటీల్లో మొత్తం 40 జట్లు పాల్గొంటున్నాయని తెలిపారు. ప్రతిభ గల క్రీడాకారులను గుర్తించి వారిని ఉన్నత స్థాయికి తీసుకెళ్లడమే తమ ఉద్దేశమన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గిరివర్ధన్‌రెడ్డి, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు విక్రమ్, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి జోగరావు, బీజేవైఎం రూరల్ జిల్లా కార్యదర్శి అతీష్‌బాబు, దుండిగల్ బీజేపీ సోషల్ మీడియా కన్వీనర్ శ్రీనివాస్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

- ఎంపీ ల్యాడ్స్ మార్చి కల్లా వినియోగించాలి
- మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్

సాక్షి, మేడ్చల్ జిల్లా: అభివృద్ధి పనులన్నీ వేగవంతంగా పూర్తి చేయాలని ఎక్కడ కూడా పెండింగ్‌లో ఉండకుండా చూడాలని మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ అన్నారు. పనులకు సంబంధించి సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో ముందుకెళ్లాన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా ప్రణాళిక అధికారి (సీపీవో) మోహన్ రావుతో కలిసి నియోజకవర్గ అభివృద్ధి నిధులు (సీడీఎఫ్) పార్లమెంట్ ప్రాంత అభివృద్ధి నిధులు (ఎంపీ ల్యాడ్స్), క్రుషియల్ బ్యాలెన్స్‌డ్ ఫండ్ (సీబీఎఫ్), ప్రత్యేక అభివృద్ధి నిధుల(ఎస్డీఎఫ్)పై ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాలో అభివృద్ధి పనులను వేగవంతం చేస్తూ అధికారులు అందరూ సమన్వయంతో పని చేయాలని అప్పుడే అనుకున్న లక్ష్యాన్ని త్వరగా పూర్తి చేయడానికి ఆస్కారముంటుందని కలెక్టర్ గౌతమ్ తెలిపారు. ఎంపీ ల్యాడ్స్‌కు సంబంధించి మార్చి 31 వరకు పూర్తి చేయాలని, ఏ మాత్రం అశ్రద్ధ వహించరాదని పేర్కొన్నారు. జిల్లాలోని అసెంబ్లీ నియోజకవర్గాల అభివృద్ధి నిధులతో పాటు ప్రత్యేక అభివృద్ధి నిధుల(ఎస్డీఎఫ్)కు సంబంధించిన పనులు ఫిబ్రవరి చివరి కల్లా పూర్తి చేయాలన్నారు. అలాగే, అభివృద్ధి పనులపై నియోజకవర్గాల వారీగా పనుల పురోగతిని ప్రత్యేకంగా కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో పనులు చేయని కాంట్రాక్టర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని,అలాగే, ఆ పనులను ఇతరులకు అప్పగిస్తామన్నారు. ప్రజాప్రతినిధులు ప్రజల కోసం అభివృద్ధి పనుల కోసం కేటాయించిన నిధులను సద్వినియోగం చేసుకునే దిశగా అధికారులు కృషి చేయాని కలెక్టర్ తెలిపారు. మరో 15 రోజుల తర్వాత మళ్లీ సమావేశాన్ని నిర్వహిస్తామని, అప్పటి వరకు అభివృద్ధి పనులు పూర్తయ్యేలా త్వరితగతిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో ఆర్ అండ్ బీ ఈఈ శ్రీనివాస్‌మూర్తి, పంచాయతీరాజ్ ఈఈ శ్రీదేవి, డీఆర్డీఏ పద్మజారాణితోసహా డీఎఫ్ఓ, డీడబ్ల్యూవో, ఇరిగేషన్, జీహెచ్ఎంసీ, వాటర్ వర్క్, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, పోలీసుశాఖ అధికారులు పాల్గొన్నారు.

స్టార్‌లైట్ ఫ్లాట్ ఓనర్స్ నూతన కమిటీ

చింతల్: స్టార్‌లైట్ ఫ్లాట్ ఓనర్స్ అసోసియేషన్ ఎన్నికల్లో భాగంగా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎం ప్రవీన్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా ఎస్ వెంగయ్య, సంయుక్త కార్యదర్శిగా కె.ఎస్ఆర్‌కే ప్రసాద్, కోశాధికారిగా కేజీకే శర్మలను ఏకగ్రీవంగా ఎన్నుకోగా కేవలం ఉపాధ్యక్ష్యుడికి మాత్రమే ఓటింగ్ నిర్వహించారు. ఈ ఓటింగ్‌లో మొత్తం 156 ఓట్లు పోల్ కాగా 57 ఓట్లు రాజేంద్ర ప్రసాద్‌రెడ్డికి, 55 ఓట్లు నరేందర్‌రెడ్డికి పోల్ కాగా మరో ఓటు చెల్లని ఓటుగా నిర్ధారణ కావడంతో రాజేంద్ర ప్రసాద్‌రెడ్డి ఉపాధ్యక్షుడిగా విజయం సాధించినట్లు అయ్యింది. ఎన్నికల అధికారిగా హెచ్.హరి గణేష్ వ్యవహరించారు.



పురపాలికల్లో ప్రగతి అధోగతి

- 5 నెలలుగా విడుదల కాని నిధులు
- 29 పురపాలికల్లో నిలిచిపోయిన అభివృద్ధి పనులు



సాక్షి, మేడ్చల్ జిల్లా: నగర శివారు నగరాలు, పట్టణాల్లో మౌలిక వసతుల కల్పన, మెరుగైన పారిశుద్ధ్యం, పచ్చదనం పెంపే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం 'పట్టణ ప్రగతి' నిధులు మంజూరు చేస్తోంది. జనాభా ప్రాతిపదికన నిధులు కేటాయిస్తున్నారు. ఆ మొత్తంతో అత్యవసర పనులు, సదుపాయాల కల్పనకు అధికార యంత్రాంగాలు ప్రాధాన్యమిస్తున్నాయి. ముఖ్యంగా ఇరుకు రహదారుల విస్తరణ, సెంట్రల్ లైటింగ్, ప్రకృతివనాలు, ఓపెన్ జిమ్, సమీకృత వెజ్–నాన్వెజ్ మార్కెట్లు, వైకుంఠధామాల నిర్మాణాలతో పాటు ఉద్యానవనాలను తీర్చిదిద్దడం ద్వారా పట్టణంలో ఆహ్లాదకర వాతావరణం పెంపొందుతోంది. వాల్ పెయింటింగ్, సూచికలు వంటి ఆకర్షణ పనులూ చేపడుతున్నారు. పథకం ఆరంభంలో నిధుల విడుదల పక్కాగా జరిగింది. కానీ, గతేడాది సెప్టెంబరు నుంచి వరుసగా ఐదు నెలలకు అందాల్సిన రూ.155 కోట్ల విడుదలపై ఆలస్యం జరుగుతుండటంతో అభివృద్ధి పనులపై ప్రభావం పడుతోంది.

అవసరాలు బారెడు.. ఆదాయం మూరెడు

నగర శివారు మేడ్చల్–మల్కాజిగిరి,రంగారెడ్డి జిల్లాల పరిధిలో 29 పురపాలక సంఘాలు ఉన్నాయి. నల్లా కనెక్షన్, ఆస్తి, ఇతర పన్నుల ద్వారా ఏడాదికి దాదాపు రూ.365 కోట్ల ఆదాయం సమకూరుతోంది. హైదరాబాద్ మహానగరానికి సమాంతరంగా శివారు పట్టణాల అభివృద్ధిపై దృష్టి పెట్టిన పురపాలికలు ..ఆమేరకు పనులు,కార్యక్రమాలు చేయలేకపోతున్నారు. అలాగే, కొన్ని పట్టణాల్లో సమయానికి పన్నులు కూడా వసూలు కావటం లేదు. ప్రత్యామ్నాయ ఆదాయ వనరులు సృష్టికి అవకాశాలూ అంతంతమాత్రమే. మరోవైపు విద్యుత్తు దీపాలు,తాగునీటి పథకాల నిర్వహణకు విద్యుత్తు బిల్లులు, పారిశుద్ధ్య నిర్వహణ, అత్యవసర ఖర్చులు నెలకు రూ. లక్షల్లో ఉంటున్నాయి. వీటికి నెలవారీ ఆదాయాన్ని మించి ఖర్చు చేసే పరిస్థితి నెలకొంది. చివరకు సిబ్బంది, కార్మిక వేతనాల చెల్లింపులకు దిక్కులు చూడాల్సిన పరిస్థితి. పారిశుద్ధ్య, ఇతర అభివృద్ధి పనుల నిర్వహణ కష్టమవుతోంది. ఈ క్రమంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 15వ ఆర్థిక సంఘం నిధుల కింద 'పట్టణ ప్రగతి'కి నెలవారీగా నిధులు వెచ్చిస్తుండగా.. అవి ఎంతో ఉపయోగపడుతున్నాయి. అవి ప్రస్తుతం సకాలంలో విడుదలకాక పోవడంతో పారిశుద్ధ్యం. స్వచ్ఛ కార్యక్రమాలకు ఆటంకం ఏర్పడుతోంది.

పేరుకుపోయిన సమస్యలు

పురపాలికల్లో సమస్యలు పేరుకుపోతున్నాయి. ఆదాయ మార్గంగా ఉన్న పన్నుల వసూలుపై అధికార యంత్రాంగం నిర్లక్ష్యం చేస్తోంది. సామాన్య మధ్య తరగతి ప్రజలకు నోటీసులు ఇచ్చి ముక్కు పిండి ఆస్తి పన్ను వసూలు చేసే పురపాలిక అధికారులు వ్యాపార వాణిజ్య సంస్థలు,పరిశ్రమలు ,విద్యాసంస్థల విషయంలో మాత్రం మెతక వైఖరి అనుసరిస్తున్నారు. పలు పురపాలక సంఘాల్లో ఆ సంస్థలు పన్ను బకాయి ఉన్నా.... ఏళ్ల తరబడిగా చెల్లించటం లేదని తెలుస్తోంది.

ట్రేడ్ లైసెన్సులు అంతే..

పురపాలికల నుంచి వ్యాపార, వాణిజ్య ట్రేడ్ లైసెన్సు తీసుకోవటం లేదు.... ఉన్న సంస్థలు వాటిని రెన్యూవల్ చేసుకొనకుండా నెట్టుకొస్తున్నారు.దీంతో పురపాలికల ఆదాయానికి భారీగా గండి పడుతోంది. పట్టణాల్లో వ్యాపార ,వాణిజ్య సంస్థలు,పరిశ్రమలు పెరుగుతున్నప్పటికిని,వాటికి తగ్గట్టుగా ట్రేడ్ లైసెన్సులు జారీ కావటం లేదు. ఉదారహరణకు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని 13 పురపాలక సంఘాల పరిధిలో 17,056 వ్యాపార సముదాయాలు ఉన్నట్లు గుర్తించినప్పటికిని, 8,998 ట్రేడ్ లైసెన్సులను మాత్రమే జారీ చేశారు. బోడుప్పల్ పురపాలక సంఘంలో 2,035 వ్యాపార సముదాయాలు ఉండగా, ట్రేడ్ లైసెన్సులు పొందినవి 455 మాత్రమే ఉన్నాయి.అలాగే, నిజాంపేటలో 4,354 గానూ ,2,135, జవహర్‌నగర్‌లో 750కి 282, దుండిగల్‌లో 1248కి 432, కొంపెల్లిలో 1,047 గానూ 256, నాగారంలో 1,211గానూ 265, పోచారంలో 411 వ్యాపార సముదాయాలకు గానూ 173 షాపులకు మాత్రమే ట్రేడ్ లైసెన్సులను జారీ చేశారు.

పన్నుల మదింపులోనూ చేతి వాటం..

పురపాలక సంఘాల్లో రెండు కంటే ఎక్కువ అంతస్తులు ఉన్న భవనాలకు కొలతలు చేసి పన్ను విధించాల్సి ఉండగా ...టౌన్ ప్లానింగ్ విభాగం ఆ పని సరిగ్గా చేయటం లేదు. ఈ కారణంగా పురపాలికలకు ఏటా రూ.లక్షల్లో ఆదాయం కోల్పోతోంది. పాలకవర్గ నిర్లక్ష్యం, అధికారుల అలసత్వం పురపాలక సంఘాల అభివృద్ధికి అవరోధంగా మారుతోంది. జిల్లాలోని పలు పురపాలక సంఘాల్లో పలువురు ఉద్యోగులు, ప్రతినిధులు చేతి వాటం ప్రదర్శిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ అక్రమాలపై కలెక్టర్ దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

టెక్స్‌టైల్స్ పరిశ్రమ అభివృద్ధికి కృషి చేయాలి



మంత్రి తుమ్మల నాగేశ్వరరావును సన్మానిస్తున్న హన్మంతరెడ్డి

కుత్బుల్లాపూర్: తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, కో ఆపరేషన్, హ్యాండ్లూమ్స్ అండ్ టెక్స్‌టైల్స్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును బుధవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ కొలన్ హన్మంత్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రికి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కుత్బుల్లాపూర్ ప్రాంతంలో టెక్స్‌టైల్స్ పరిశ్రమ అభివృద్ధికి కృషి చేయాలని హన్మంత్‌రెడ్డి కోరారు. కాంగ్రెస్ నాయకులు కొలన్ శ్రీనివాస్‌రెడ్డి, నిజాంపేట్ కార్పొరేషన్ అధ్యక్షుడు కొలన్ రాజశేఖర్ రెడ్డి, నరేందర్‌రెడ్డి, గణేష్, ప్రభాకర్, రవీందర్, బుచ్చిరెడ్డి, జితేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.